



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 242

పేజీలు : 4 వెల రూ.4/-

**Circulated by :** Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 3 ఫిబ్రవరి 2024




సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ నేత, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణ, హాజరైన గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని).

-అమరావతి,కలంకౌంటర్ :



మర్కాపురం నుంచి అన్నా రాంబాబు.... గిద్దలూరు నుంచి కుందూరు నాగార్జునరెడ్డి ఖరారు....!

-అమరావతి, కలంకౌంటర్ :

# ఏపీ గవర్నర్ ను అభినందించిన విశాఖ శారదాపీఠం



**విజయవాడ,కలంకౌంటర్ :** విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి శుక్రవారం విజయవాడలో రాజ్ భవన్ ను సందర్శించారు. గవర్నరు అబ్దుల్ నజీర్ ను కలిసారు. ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న విశాఖ శారదాపీఠం వార్షిక మహోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈమేరకు ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో అయోధ్య రామ మందిరానికి అనుకూలంగా గతంలో తీర్పునిచ్చిన న్యాయమూర్తుల్లో ఒకరైన అబ్దుల్ నజీర్ ను అభినందించారు. శతాబ్దాల నాటి కల సాకారం కావడంలో గవర్నరు పాత్ర ఉండటం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. సుప్రీంకోర్టు వేదికగా వచ్చిన చారిత్రాత్మక తీర్పుల్లో అయోధ్య ఒకటని, అప్పటి నిర్ణయాన్ని భారతావని ఎన్నటికీ మరువదని పేర్కొన్నారు. అయోధ్య వివాద సమయంలో సుప్రీంకోర్టు వేదికగా చోటుచేసుకున్న అనేక పరిణామాలను స్వాత్మానందేంద్రకు గవర్నర్ వివరించారు.


# జగన్ పాలనలో కొందరు పోలీసులు కిడ్నాపర్లుగా మారారు

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



**అమరావతి,కలంకౌంటర్ :** గంజాయి సరఫరా చేస్తూ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఇద్దరు పోలీసులు తెలంగాణలో పట్టుబడిన ఘటనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. ఆర్థిక ఉగ్రవాది జగన్ పాలకుడు అవడంతో రాష్ట్రంలో వనరులన్నీ దోపిడీకి గురై అరాచకం రాజ్యమేలుతోంది. కొంతమంది పోలీసులు దొంగలు, స్మగ్లర్లు, కిడ్నాపర్లుగా మారుతున్నారు. రాజకీయ కక్ష సాధింపుల కోసం జగన్ ఖాకీలను ప్రైవేటు ఫ్యాక్షన్ సైన్యంగా వాడటంతో వారికీ నేరాలు అలవాటైపోయాయని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విటర్)లో పోస్ట్ చేశారు. పాలకులే సీఐడీని కిడ్నాపులు, బెదిరింపులకు వినియోగిస్తున్నారు. తాము ఏం చేసినా అడిగేవారు లేరని పోలీసులు ముఠాలుగా ఏర్పడటం ఆ వ్యవస్థ గౌరవాన్ని మంటగలిపింది. కర్నూలు డీఐజీ ఆఫీస్‌లో ఎస్పైగా పనిచేస్తున్న సుజన్ ఓ ముఠాని ఏర్పాటు చేసి ఏపీ సీఐడీ బృందం పేరుతో ఐటీ కంపెనీ యజమానిని కిడ్నాప్ చేసి హైదరాబాద్‌లో చిక్కిన ఘటన ఆందోళన కలిగిస్తోంది. తాజాగా 22 కిలోల గంజాయితో కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ హైదరాబాద్ పోలీసులకు చిక్కడం ఏపీలో పోలీసులే గంజాయి స్మగ్లర్లుగా మారిన దుస్థితిని వెల్లడిస్తోందని లోకేశ్ పేర్కొన్నారు.

# ఏపీ పేరు అభివృద్ధిలో కంటే డ్రగ్స్ లోనే ఎక్కువగా వినిపిస్తోంది: చంద్రబాబు



**గుంటూరు,కలంకౌంటర్ :** హైదరాబాదులో ఇద్దరు ఏపీ పోలీసులు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడిన ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు స్పందించారు. దురదృష్టవశాత్తు గత నాలుగున్నరేళ్లుగా ఏపీ పేరు అభివృద్ధిలో కంటే డ్రగ్స్ విషయంలోనే ఎక్కువగా వినిపిస్తోందని పేర్కొన్నారు. తాజాగా కాకినాడకు చెందిన ఇద్దరు పోలీసులు హైదరాబాదులో అరెస్ట్ కావడం తీవ్ర ఆందోళనకర అంశమని, రాష్ట్రానికి తలవంపులు తెచ్చే ఘటన అని విమర్శించారు. ఈ విచారకరమైన ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఒక కీలకమైన ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఈ రాకెట్ వెనుక ఉన్న సూత్రధారి ఎవరు. ఎవరెవరు నేతలు ఇందులో ఉన్నారు?" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

**దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలోనే : బుద్ధా వెంకన్న..** హైదరాబాదులో నిర్వహించిన యాంటీ డ్రగ్ ఆపరేషన్ లో ఇద్దరు ఏపీ పోలీసులు పట్టుబడడంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బుద్ధా వెంకన్న కూడా స్పందించారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలో తేలాల్సిందేనని విమర్శించారు. "హైదరాబాదులోని బాచుపల్లిలో 22 కేజీల గంజాయిని తీసుకెళుతున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఆరా తీస్తే కాకినాడలో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ సిక్ లీవు పెట్టి మరీ ఈ దందాను నడిపిస్తున్నారని తేలింది. జగన్ రెడ్డి నుంచి స్ఫూర్తి పొంది ఉంటారు" అంటూ బుద్ధా వెంకన్న వ్యంగ్యం ప్రదర్శించారు.

# సార్వత్రిక ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించిన సి.ఇ.ఓ. ముకేశ్ కుమార్ మీనా



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన మీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఎన్నికల సంసిద్ధత, ఓటర్ల జాబితా నవీకరణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటన, నోటిఫికేషన్ జారీకి ఎక్కువ సమయం లేదని ఈ లోపే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబందించిన తాజా మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపించడం జరిగిందని, వాటిపై జిల్లా ఎన్నికల అధికారులు సమగ్ర అవగాహను పెంపొందించుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల వారీగా ఉన్న సమస్యాత్మమైన పోలింగ్ స్టేషన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ద చూపాలని, సునిశితమైన, సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లలతో పాటు 1,200 మంది ఓటర్ల పైబడిన ఉన్న పోలింగ్ స్టేషన్లకు తప్పని సరిగా వెబ్ టెలీకాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఈ వెబ్ కాస్టింగ్ కు సంబందించి తాత్కాలిక నివేదిను తమకు వెంటనే పంపాలన్నారు. ప్రతి జిల్లాలోనూ కనీసం 50 శాతం పోలింగ్ స్టేషన్లు వెబ్ టెలీకా స్టింగ్ లో కవర్ అవ్వాలని, ఈ వెబ్ టెలీ కాస్టింగ్ అనేది పోలింగ్ స్టేషన్ కే పరిమితం కాకుండా చుట్టు ప్రక్కల పరిసరాలను కూడా కవర్ అయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రాంతాల వారీగా వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లో మ్యాపింగ్ పనులను కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు, కనీస మౌలిక వసతుల కల్పన పనులను సాద్యమైనంత త్వరగా పూర్తి చేయాల న్నారు. దివ్యాంగులు, వయో వృద్ధులైన ఓటర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వీరికి అవసరమైన ర్యాం పుల నిర్మాణ పనులు ఈ నెల 5 వ తేదీ కల్లా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులనే తప్పని సరిగా నియమించాలని, మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణా కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రతి జిల్లాకు సంబందించిన జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ముసాయిదా ప్రతిని వచ్చే సోమవారాని కల్లా తమ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీల సమన్వయంతో అక్రమ నగదు, లిక్కరు ఇతర సామాగ్రి రవాణాపై ప్రత్యేక దృష్టి ఉంచాలని, కేవలం రాష్ట్ర సరిహద్దుల్లోనే కాకుండా జిల్లాల్లో జరుగుచున్న అక్రమ కార్యకపాలపై నిఘా ఉంచాలన్నారు. ఇందుకు సంబందించిన నివేదికలను తమకు సకాలంలో పంపాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవో పి. కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్, డిప్యూటీ సీఈవో లు ఎస్.మల్లిబాబు, కే. విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## చింతలపూడిలో ఈనెల 5 వ తేదీన జరగనున్న రా కదిలిరా, కార్యక్రమం



**చింతలపూడి,కలంకౌంటర్ :** చింతలపూడిలో ఈనెల 5 వ తేదీన జరగనున్న రా కదిలిరా, కార్యక్రమంలో భాగంగా, సబా ప్రాంగణాన్ని, పరిశీలించిన మాజీ మంత్రి కొల్లు. రవీంద్ర, మాజీ ఎంపీ. కొనకళ్ళ నారాయణ, ఏలూరు పార్లమెంట్ అధ్యక్షులు గన్ని.వీరాంజనేయులు, మాజీ కన్వీనర్ జగ్గవరపు. ముత్తారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంట మురళి, రాష్ట్ర కార్యదర్శి. దాసరి. ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## కష్టం అంటే ముందుకు గుర్తు వచ్చే పేరు బరిగెల కోటేష్



**తిరువూరు(ఎన్టిఆర్‌జిల్లా),కలంకౌంటర్ :** పార్టీలఅతీతంగా కష్టాలు ఎవరున్నా సరే ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో సాయం చేస్తున్న వైఎస్సార్ సీనియర్ నాయకులు బరిగెల కోటేష్ తిరువూరు పట్టణానికి చెందిన మైలవరపు నరసింహారావు వాళ్ల సతీమణి మైలవరపు రాజ్యం మృతిచెందగా అధిక సాయం కోసం సోషల్ మీడియాలో పెట్టిన వార్త కు చలించి తన వంతుగా 10,000 రూపాయల ఆర్థిక సహాయం, 50 కేజీల పువ్వులు అందజేసిన బరిగెల. కోటేష్ తోటి మనిషిగా మనుషులను ఆపద సమయంలో ఆదుకోవడం తన ప్రథమ కర్తవ్యం అన్న బరిగెల కోటేష్

## పేద ఆర్యవైశ్య కుటుంబాన్ని ఆపదలో ఆదుకున్న తిరువూరు ఆర్యవైశ్య సమాజం



**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరుకు చెందిన మైలవరపు నరసింహారావు వాళ్ల సతీమణి రాజ్యం మృతి చెందగా తిరువూరు ఆర్యవైశ్య సమాజం తరపున 5000 రూపాయలు సహాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సమాజ అధ్యక్షులు గుడిమెట్ల మురళి ఉపాధ్యక్షులు. దోసపాటి. రవి కుమార్ జాయింట్ సెక్రెటరీ. చిత్తలూరు. నరసింహారాజు (పండు ) కొత్తగుండ్ల శేషు నెంబర్ వన్ రాజా బండారు శ్రీనివాసరావు. పాల్గొనడం జరిగింది

## న్యాయవాదులు వినూత్నరీతిలో నిరసన




**మచిలీపట్నం లీగల్,కలంకౌంటర్ :** నూతన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మచిలీపట్నం లో న్యాయ దేవత ఎదుట న్యాయవాదులునల్ల బెలూన్లు ఎగరవేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.



నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొమ్మసాని ఉమామహేష్ అధ్యక్షతన పట్టణ తెలుగుదేశం పార్టీ సమావేశం.. రేపు విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు పర్యటన సందర్భంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శావల దేవదత్ పాల్గొన్నారు.. పట్టణంలోని 20 వార్డుల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

**–తిరువూరు,కలంకౌంటర్ :**

# బస్ షెల్టర్ కు శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు





**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండలం కే కొత్తపాలెం గ్రామంలోని కరకట్ట పక్కన నూతనంగా నిర్మించనున్న బస్సు షెల్టర్ కు సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, ఎంపీపీ రావి దుర్గా వాణి, జడ్పిటిసి సభ్యులు మేడబలిమి మల్లికార్జునరావు, మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, సిడిసి మాజీ చైర్మన్ రావి నాగేశ్వరరావు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు సాంప్రదాయంగా భూమి పూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర కుమార్ నిధుల నుండి 5 లక్షలతో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ను నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

**జీఎస్పీ రోడ్లను ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు..** మోపిదేవి మండల పరిషత్ నిధులు ఐదు లక్షలతో కే కొత్తపాలెం హరిజనవాడలో ఐదు రోడ్లను ఎంపీపీ రావి దుర్గా వాణి చొరవతో మంజూరు చేశారు. నిర్మాణం పూర్తయిన రోడ్లను శుక్రవారం సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పిటిసి సభ్యులు మేడబలిమి మల్లికార్జునరావు, మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు సిడిసి మాజీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ స్రవంతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గీతా జ్యోతి, కొక్కిలిగడ్డ ఏసేబు, బుర్రి చెంచు, బుర్రి నాగేంద్రం, దుట్టా శేషు, తుటారం సుబ్బారావు, పడమట వెంకటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించిన మాదివాడ వెంకటకృష్ణ..



**మోపిదేవి,కలంకౌంటర్ :** ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులను అక్షయ డెవలపర్స్ అధినేత, జనసేన పార్టీ నియోజకవర్గ నేత మాదివాడ వెంకటకృష్ణ ( క్రిస్టియన్ ) పరామర్శించారు. మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామానికి చెందిన ప్రముఖ జర్నలిస్ట్ కృత్తివెంటి సత్యనారాయణమూర్తి సతీమణి పద్మావతి గత రెండు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న వెంకటకృష్ణ శుక్రవారం సాయంత్రం పెదప్రోలులో సత్యనారాయణమూర్తి తో పాటు కుమారులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ పార్టీ కన్వీనర్ బాచు శ్రీనివాసరావు, దోవారి మాధవ, మానికొండ లీలా కృష్ణ, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, బాచు డేవిడ్, యన్నం ముసలయ్య, బాచు రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే మెరకనపల్లి పంచాయతీలో గల చిరువోలు గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కర్రా శ్రీనివాసరావు మాతృమూర్తి అలివేలి మంగమ్మ ( 85 ) జనవరి 29వ తేదీన మరణించారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మాదివాడ వెంకటకృష్ణ చిరువోలులోని శ్రీనివాసరావు గృహంలో పరామర్శించి, మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సింగ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆంధ్ర కేసరి సేవా సమితి ఆధ్వర్యంలో ఆంధ్రకేసరికి ఘన నివాళులు


- **55వ ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం**



**కందుకూరు,కలంకౌంటర్ :** 55వ ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరులో ప్రకాశం పంతులు రోడ్డు(కోవూరు)లో ఉన్న ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు విగ్రహానికి ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర కేసరి సేవా సమితి అధ్యక్షులు మంచిరాజు మురళీమోహన్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి తుపాకికి తన గుండెను చూపించిన ధైర్యశాలి, స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీద 1970 సంవత్సరంలో ఒంగోలు జిల్లాని మహనీయుడు ప్రకాశం పంతులు పేరుమీద ప్రకాశం జిల్లా అని నామకరణం చేశారని అన్నారు. ప్రకాశం పంతులు లాంటి త్యాగమూర్తులను మనము ఎప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఆంధ్రకేసరి సేవా సమితి తో పాటు కందుకూరు బిజెపి నాయకులు పాల్గొని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి సేవా సమితి అధ్యక్షులు మంచిరాజు మురళీమోహన్,ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, జనార్ధన స్వామి ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఆర్ వెంకటేశ్వర్లు, కాకర్ల రాజగోపాల్ రావు, ఏవి రావు, చలంచర్ల సుబ్బారావు, బీవీఎల్ఎన్ మూర్తి, ఇస్కాల మధుసూదన్ రావు,జిల్లెల్లమూడి వెంకటేశ్వర్లు,కందుకూరు శ్రీనివాసులు దీక్షితులు,రామచంద్రుని మల్లయ్య,కందుకూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు మన్నేపల్లి ప్రసాద్,గుడ్లూరు వెంకటేశ్వరరావు,గాదిరాజు నాగరాజు, బిజెపి నాయకులు ఘట్టమనేని హరిబాబు, మువ్వల భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయం - మంత్రి సురేష్





**కొండేపి,కలంకౌంటర్ :** మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయం అని మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి ఆది మూలపు సురేష్ అన్నారు.కొండపి లో వైయస్సార్ నాలుగో విడత ఆసరా పథకం ద్వారా మహిళలకు చెక్కున అందజేశారు. కొండపి మండలంలో 887 గ్రూపులకు గాను. 8848 మంది లబ్ధిదారులకు. ఆరుకోట్ల 93 లక్షల 9వెలు. రూపాయల. లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా వసుంధర,.ఏరియా కో ఆర్డినేటర్ సనీత,కొండపి జెడ్పిటిసి మరెడ్డి అరుణకుమారి, కొండపి మండల నాయకులు. ఏపీఎం. సీసీస్ ఓఎస్ డ్వాక్రా గ్రూప్ మహిళలు, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు

# సానుకూల ఆలోచనలు మానవ విలువులకు అద్దం

- **నాస్తికోద్యమానికి గోరా అందించిన సేవలు అమూల్యం**
- **జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు**

**విజయవాడ, కలంకౌంటర్ :** సానుకూలంగా ఆలోచించే ఏ వ్యక్తి అయినా దేవుడు ఉన్నాడు, లేడు అనే విషయంతో సంబంధం లేకుండా సమాజంలోని వ్యక్తుల ప్రయోజనాల కోసమే పనిచేస్తారని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. భారతదేశ నాస్తికోద్యమ పితామహుడు గోపరాజు రామచంద్రరావు (గోరా) ఐదు దశాబ్దాల క్రితం 1972లో రచించిన ఆంగ్ల పుస్తకం "పాజిటివ్ అథీజం" తెలుగు అనువాదాన్ని బెంజ్ సర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో శుక్రవారం జరిగిన సభలో కలెక్టర్ డిల్లీరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ భారతదేశ నాస్తికోద్యమానికి గోరా ఒక గొప్ప చిరునామాగా నిలిచారన్నారు. దైవత్వం అనేది వ్యక్తులకు ఆపాదించడాన్ని వ్యతిరేకించడమే నాస్తికత్వానికి ఆలంబన అని గోరా గాఢంగా నమ్మేవారన్నారు. సమాజంలోని వ్యక్తుల ప్రయోజనాలను కాపాడలేని వారిని విగ్రహాల రూపంలో ఆరాధించడం తప్పుడు అభిప్రాయమని నమ్మిన ఎంతోమందిని ఆ రోజుల్లోనే గోరా చాలా ప్రభావితం చేశారని గుర్తు చేశారు. అంతిమంగా సంఘ ప్రయోజనాలను కాపాడటమే నాస్తికత్వానికి ఉన్న అతి పెద్ద లక్ష్యంగా ఆయన సాగించిన ఉద్యమం నేటికీ నిరాఘాటంగా కొనసాగడం, ఈ ఉద్యమాన్ని వారి కుటుంబ సభ్యులు మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. సమాజంలో మనుషులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆ సమస్యకు పరిష్కారం వెతికేందుకు హేతుబద్ధంగా ఆలోచించడమే నాస్తికత్వానికి పునాది అన్నారు. హేతుబద్ధత లేకుండా ఆలోచించి సమస్య పరిష్కారం కాని పక్షంలో ఏదో ఒక అతీంద్రియ శక్తి ఉందని నమ్మడమే ఆస్తికత్వమని దశాబ్దాల క్రితమే గోరా సమాజంలో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు స్వతంత్ర భావాలతో జీవితాన్ని, ముఖ్యంగా ఆర్థిక పరంగా మన మీద మనమే ఆధారపడాలన్నదే నాస్తికత్వం ముఖ్య ఉద్దేశ్య మన్నారు. ప్రతి మానవుడు తన దైనందిన జీవితంలో చేసే పనులకు వాస్తవికతను జోడించి ఆలోచిస్తే అర్థమౌతుందని, ఫలితం మనం చేసే పనులద్వారా జరుగుతుందని అప్పుడు దైవం దేవుడు అనే మాటలపై ఆలోచన ఉండదన్నారు.



విస్సన్నపేట మండలం విస్సన్నపేట ఎస్సైగా విధులు చేపట్టిన జి.రామకృష్ణ

**–విస్సన్నపేట,కలంకౌంటర్ :**

# డీఎస్పీ రామచంద్రను ఘనంగా సన్మానించిన ఎస్పీ



**కందుకూరు,కలంకౌంటర్ :** బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళుతున్న కందుకూరు డిఎస్పి రామచంద్ర ను నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు.

# రక్తదానం చేసిన నగేష్ బాబు



**కందుకూరు,కలంకౌంటర్ :** నేటి యువతలో రక్తదానం అవగాహన పెరగాలని హెడ్ క్రాస్ చైర్మన్ చన్నా రామాంజనేయులు అన్నారు.రక్త దానానికి ఏవీ అవసరం లేదు, కేవలం ప్రాణాపాయం లో వున్న వారిని కాపాడాలని తపన తప్ప అని నిరూపించాడు యీ యువకుడు మువ్వల రాజేష్ అని రామాంజనేయులు అన్నారు.ఒంగోలు రిమ్స్ లో ఒక గర్భిణీ కి నొప్పులు రాగా అత్యవసరంగా ఆమెకు రక్తం ఇచ్చే దాత కావాలని వైద్యులు కోరారు. దీనికి తక్షణమే స్పందించిన నరేష్ తన స్వంత ఖర్చులతో వెంటనే ఒంగోలు కు వెళ్లి రక్త దానం చేశారు. నరేష్ రోజువారీ జీతంతో పనిచేసే చిరుద్యోగి. వీరి తండ్రి రాజా కూడా ఒక షామియానా షాప్ లో పనిచేస్తుంటారు. నరేష్ తాత మువ్వల భూషయ్య భాజపా నేత. కాగా భూషయ్య దగ్గర నుండి వారి కుటుంబంలో అందరూ రక్త దాతలు,నేత్ర దాతలు అవడం విశేషం అని రామాంజనేయులు నగేష్ ను అభినందించారు. గర్భిణీ కుటుంబ సభ్యులునగేష్ కు ధన్యవాదాలు తెలిపారు.

# మాలకొండలో అంగళ్ళ వేలం పాట

- **పాటలో వచ్చిన మొత్తం రూ 22,13,000/-లు**
- **వాయిదా పడిన వేలం పాటలు ఫిబ్రవరి 16న జరుపుతాం ఆలయ ఈవో**





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి ఆలయ ఈవో, సహాయ కమిషనర్ కేబి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షణలో అంగళ్ళ వేలం పాటలు నిర్వహించారు. నెయ్యి, పాలు బచ్చు వెంగళరావు రూ 89000/-లు, బొమ్మల అంగడి ఒకటి కామినేని కొండలరావు రూ 3,72000/-లకు, రెండవ బొమ్మల అంగడి కామినేని మాధవరావు రూ 3,21,000/-లు,కూల్ డ్రింక్స్ అంగళ్ళు ఒకటి రెండు కామినేని కొండలరావు రూ 14,31,000/-లకు పాడారని ఆలయ ఈవో కేబి శ్రీనివాసరావు తెలిపారు. తలనీలాల పాట మరికొన్ని అంగళ్ళ పాటలు వాయిదా పడ్డాయని అవి ఈనెల 16వ తేదీన జరుగుతామని తెలిపారు.

# అందరికీ ఉపయుక్తంగా మీడియా డైరీ

● ఆవిష్కరణ సభలో యూనియన్ నాయకులు ఉద్ఘాటన



విజయవాడ,కలంకౌంటర్ : విస్తృత సమాచారంతో కూడిన మీడియా డైరీ 2024 జర్నలిస్టులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు ఉద్ఘటించారు. క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డైరీని, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ మీడియా డైరీ ని తీసుకురావడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. సమాచారాన్ని,ముఖ్యమైన సంఘటనలను నిక్షిప్తం చేసుకోవడానికి డైరీ ఎంతో దోహదపడుతుందని నాయకులు అన్నారు. ప్రతి జర్నలిస్టు డైరీ రాయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనియన్ అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ సభలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డైరీని ఐజెయు కార్యదర్శ డి.సోమ సుందర్, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ డైరీని సి.చానల్ అధినేత టీ.వీ రమేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. విజయవాడ యూనిట్ తొలిసారిగా తీసుకొచ్చిన క్యాలెండర్ ను ఏపీయుడబ్ల్యూజే అధ్యక్షులు శ్రీ ఐ.వి సుబ్బారావు ఆవిష్కరించారు. డైరీల ఆవిష్కరణకు ముందు శ్రీయుతులు రమేష్ బాబు,ఎపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ ,డి.సోమసుందర్ ,ఐ.విసుబ్బా రావు, ఐజెయి కౌన్సిల్ సభ్యులు ఎస్.కే.బాబు ,సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి మాట్లాడుతూ,ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వారి ఎన్నికల ప్రణాళికలో పొందు పర్చాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు తమ సహాయ,సహకారాలు వుంటాయని రమేష్ బాబు హామీ యిచ్చారు. వేదికపై ఏపీడబ్ల్యూజే ఉపాధ్యక్షులు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచెల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు యేచూరి శివ ఆశీనులయ్యారు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు తొలుత స్వాగతం పలికి వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ఎపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. హాజరైన జర్నలిస్టులతో ప్రెస్ క్లబ్ కిక్కిరిసిపోయింది...

# రాజ్ భవన్ కు వచ్చిన కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడు

● గవర్నర్ కు వినతిపత్రం అందజేత



విజయవాడ,కలంకౌంటర్ : కోడికత్తి కేసులో గత ఐదేళ్లుగా జైల్లో ఉన్న నిందితుడు జనుపల్లి శ్రీను విడుదల కోసం అతడి కుటుంబ సభ్యులు పోరాటం చేస్తున్నారు. ఇవాళ కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడు విజయవాడలో రాజ్ భవన్ కు వచ్చారు. కోడికత్తి కేసులో తమకు న్యాయం చేయాలంటూ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో ముఖ్యమంత్రి జగన్ కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పేలా చూడాలని గవర్నర్ ను కోరినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సాక్ష్యం చెబితే శ్రీను బయటికి వస్తాడని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కోడికత్తి శ్రీను కుటుంబానికి దళిత సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు అండగా నిలిచాయి. గవర్నర్ ను కలిసిన వారిలో సమతా సైనిక్ దళ్, అఖిలపక్ష నేతలు కూడా ఉన్నారు. కోడికత్తి కేసులో జగన్ సాక్ష్యం చెప్పకుండా జాప్యం చేస్తుండడంతో, శ్రీను జైల్లోనే మగ్గిపోతున్నాడని వారు గవర్నర్ కు వివరించారు. ఏపీలో దళితులపై అఘాయిత్యాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయంటూ వివిధ ఘటనలను వారు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

**దేశ చరిత్రలో ఇలాంటి కేసు ఎప్పుడూ చూడలేదు: వర్ల రామయ్య..** కోడికత్తి కేసు వ్యవహారంపై రాజ్ భవన్ కు వచ్చిన వారిలో టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య కూడా ఉన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఇలాంటి కేసు ఎప్పుడూ చూడలేదని అన్నారు. జగన్ కుట్రపూరితంగానే శ్రీనును ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని ఓదార్చిన నారా భువనేశ్వరి



ఆత్మకూరు,కలంకౌంటర్ : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్ర లో భాగంగా శుక్రవారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక అల్లిపురంలో గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త కముజుల ఆంజనేయరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.3లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు.

# సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయండి - ఉప్పాల రాము



పెడన(కృష్ణా జిల్లా),కలంకౌంటర్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దెందులూరు లో శనివారం చేపట్టిన సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తరలిరావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, వైసిపి పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము పిలుపు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ సిద్ధం బహిరంగ సభ ద్వారా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నారని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల నుంచి లక్షలాదిమంది సిద్ధం బహిరంగ సభకు తరలి వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. నియోజవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నుంచి పదివేల మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధం బహిరంగ సభకు తరలి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా 200 ప్రత్యేక వాహనాల ద్వారా బహిరంగ సభకు తరలి వెళ్లే విధంగా కార్యచరణ రూపొందించామని తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు పెడన పట్నంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి వాహనాల ర్యాలీ బయలుదేరుతుందని పేర్కొన్నారు. సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఉప్పాల రాము విజ్ఞప్తి చేశారు.

# తిరువూరు బాలోత్సవం కరపత్రం ఆవిష్కరణ...



తిరువూరు,కలంకౌంటర్ : తిరువూరు బాలోత్సవం.. ద్వితీయ పిల్లల పండుగ కరపత్రమును ఈరోజు జయకృష్ణ హాస్పిటల్ నందు డా.పెనుమల్లి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువూరు బాలోత్సవం ను గత సంవత్సరం నిర్వహించినట్లుగా ఈ సంవత్సరం కూడా తిరువూరు వాహినీ ఇంజనీరింగ్ కళాశాల లో ఫిబ్రవరి 17వ తేదీ నిర్వహిస్తున్నామని.. విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న అంశాలలో ప్రోత్సహించడం, సృజనాత్మక ఆలోచనలు పెంచడం..తదితర లక్ష్యాలతో ఈ బాలోత్సవం ను నిర్వహిస్తున్నామని..ఈ అవకాశాన్ని ప్రధానోపాధ్యాయులు,ఉపాద్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి యం.హరికృష్ణ, కమిటీ సభ్యులు గుళ్లపల్లి, వెంకట రత్నం, యల్.గంగాధర్, కె.పాపారావు, పాకాల. రామకృష్ణ, యం.రాంప్రదీప్,పి.శీనయ్య, ఈ.భరత కుమారి,ఉషారాణి,వెంకట రత్నం, తులసీ రాణి,డి.సుదర్శన్,సుభాని నాగమణి ,జయకృష్ణ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కిలివేటి, ఎంపీపీ అల్లూరును కలిసిన సూళ్లూరుపేట ఎంపీడీవో చంద్రమౌళి



సూళ్లూరుపేట,కలంకౌంటర్ : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎంపీడీవో టి.చంద్రమౌళి నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈసందర్భంగా సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యని సూళ్లూరుపేటలోని వారి యొక్క క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య,ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, ఎంపీడీవో టి.చంద్రమౌళికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైసీపీ ఆరో జాబితా విడుదల

గుంటూరు,కలంకౌంటర్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నిస్థానాల్లో గెలుపే లక్ష్యంగా అధికార వైఎస్సార్‌సీపీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ క్రమంలో పలు అసెంబ్లీ స్థానాలకు, పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను మారుస్తోంది. తాజాగా పార్టీ అధిష్టానం శుక్రవారం సాయంత్రం ఆరో జాబితాను విడుదల చేసింది.నాలుగు పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలకు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను మార్చింది వైఎస్సార్‌సీపీ అధిష్టానం. మేరుగ నాగార్జున, సజ్జల రామకృష్ణారెడ్డి ఈ జాబితాను ప్రకటించారు. రాజమండ్రి (ఎంపీ) డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గుంటూరు ఎంపీగా ఉమ్మారెడ్డి వెంకట రమణ, నర్సాపురం ఎంపీ గూడురి ఉమాబాల(అడ్వొకేట్), , చిత్తూరు ఎంపీ(ఎస్సీ) ఎన్ రెడ్డప్ప, మైలవరం ఎమ్మెల్యే సర్నాల తిరుపతిరావు యాదవ్, మార్కాపురం ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే కే నాగార్జున రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే ఎండీ ఖలీల్ (డిప్యూటీ మేయర్‌గా ఉన్నారు), జీడీ నెల్లూరు కే నారాయణస్వామి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బుట్టా రేణుకగా నియమించారు. ఇప్పటివరకు ఐదు జాబితాల వారీగా 61 మంది ఎమ్మెల్యే నియోజకవర్గాలకు, 14 పార్లమెంట్ స్థానాలకు ఇన్‌ఛార్జిలను మార్చేసింది. వై నాట్ 175 నినాదంతో ప్రజలకు జరిగిన మంచిని, అందిన సంక్షేమాన్ని.. రాష్ట్రానికి జరిగిన అభివృద్ధిని చూపిస్తూ ఎన్నికలకు సిద్ధం అవుతోంది వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

# ఎస్పీ మలిక గర్గ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సిఐలు





ఒంగోలు,కలంకౌంటర్ : సాధారణ బదిలీలలో భాగంగా సిఐ యస్.సుబ్బారావు ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సర్కిల్ కి బదిలీ అయ్యారు. సీఐకే వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ సర్కిల్ లో రిపోర్ట్ చేస్తుకున్న తదుపరి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి మలిక గర్గ్ ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛమును అందజేశారు.

# శ్రీ అంకమ్మ తల్లి కి వైభవంగా అభిషేకం పల్లకి సేవ

కందుకూరు,కలంకౌంటర్ : కందుకూరు గ్రామ దేవత, ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రతి శుక్రవారం నిర్వహించే పంచామృత అభిషేకం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు.శుక్రవారం అమ్మవారికి పంచామృతాలతో, పసుపు, కుంకుమ, గంధం, విభూదిలతో కన్నుల పండుగ గా అమ్మవారి అభిషేకం జరిగింది. అభిషేకానంతరం అమ్మవారిని నైనానందకరంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. మహిళా భక్తులు లలిత సహస్రనామ పారాయణ అన్ని ఆలపించారు.శ్రీకాకొల్లు వెంకట సుబ్బారావు కుమారులులక్ష్మీ ప్రసాద్,ప్రదీప్, సూర్య కుమార్. బోండా లక్ష్మీ ప్రసన్నకుమారి కుమార్తె శ్రీశశి, గొల్ల కొండయ్య శెట్టి మల్లికార్జునరావులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.కన్నుల పండుగగా శ్రీ అంకమ్మ తల్లి పల్లకి సేవ శుక్రవారం రాత్రి నిర్వహించారు. తొలుత శ్రీ అంకమ్మ తల్లికి పూజ నిర్వహించి పల్లకి సేవ ప్రారంభించారు. మంగళ వాయిద్యాలతో, కోలాటం నృత్యాలతో పల్లకి సేవ వైభవంగా జరిగింది. శ్రీ నటరాజనాట్యమండలి సరస్వతీ నిలయం వారు చిన్నారులతో పల్లకి సేవ ముందు నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. జై అంకమ్మ తల్లి నినాదాలతో ఆలయ ప్రాంగణం



మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ పి రాజాబాబును శుక్రవారం కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిసిన గుడివాడ మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి

-మచిలీపట్నం,కలంకౌంటర్ :



మైలవరం నూతన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్వర్ణాల తిరుపతిరావు

-మైలవరం,కలంకౌంటర్ :

# ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన..



**ఆదిలాబాద్,కలంకౌంటర్ :** ఇంద్రవెల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. అతి త్వరలోనే రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించారు. త్వరలో లక్షమంది మహిళలకు అందిస్తామని చెప్పారు. అంతే కాకుండా.. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని త్వరలోనే అమలు చేస్తామన్నారు. అంతే కాకుండా.. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటానని సీఎం రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గూడాలకు రోడ్లు, నాగోబా అభివృద్ధి కోసం పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. అమర వీరుల కుటుంబాలకి రూ. 5 లక్షల ఇచ్చి అండగా నిలిచాం.. కేసీఆర్ 10 ఏళ్లలో ఆదివాసిల గురించి ఒక్క రోజైనా ఆలోచించావా అని ప్రశ్నించారు. తోటల్లో అడవి పందులు పడి ఎలా విధ్వంసం చేస్తాయో, అలా రాష్ట్రాన్ని కేసీఆర్ వాళ్ల కుటుంబం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. మీరు నీళ్ళు ఇస్తే 65 వేల కోట్లు నిధులు ఎందుకు ఇవ్వాల్సి వచ్చేది అని ప్రశ్నించారు. నీ బిడ్డలు, నీ దోపిడీ, ఫార్మ్ హౌస్ ఎలా కట్టాలని ఆలోచించావు తప్పా.. ప్రజల కోసం ఆలోచించ లేదని మండిపడ్డారు. 7 వేల స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు తాము ఇచ్చామన్నారు. నిరుద్యోగుల బాధ చూడలేక కోర్టుల్లో ఉన్న కేసుల్ని పరిష్కరించే ప్రయత్నం చేశామని తెలిపారు. 15 రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రెండు నెలలు కాలేదు.. ఇప్పుడే 6 గ్యారంటీలు అమలు చేయలేదు అంటున్నారన్నారు. కడెం రిపేర్ చేస్తాం.. సదర్మాట్, కుప్టి నిర్మిస్తామని తెలిపారు. ఈ ప్రాంతానికి ఎప్పుడైనా వచ్చావా అని కేసీఆర్ ను ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని పడగొడుతా అంటున్నారు.. ఎవ్వడు వచ్చేది.. ప్రజల ప్రభుత్వం తమది ప్రజా ప్రభుత్వం అని అన్నారు. కాళేశ్వరం గాలికి పోయింది.. నువ్వు నీ ఖాన్ దాన్ వచ్చినా ఏం చేయలేరని మండి పడ్డారు. జన్మలో మళ్లీ కేసీఆర్ సీఎం కాలేడని విమర్శించారు. మతం పేరుతో ఒకరు.. మద్యం పేరుతో మరొకరు వస్తారు.. ప్రతీ తండా, గూడెం లలో రోడ్లు వేసే బాధ్యత తమదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ ఎంపీ సీటు గెలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# మాది మహిళా పక్షపాత ప్రభుత్వం : హోంమంత్రి తానేటి వనిత





**కొవ్వూరు,కలంకౌంటర్ :** తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, తల్లి కడుపులోని బిడ్డ నుండి వృద్ధురాలి వరకు అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. శుక్రవారం నల్లజర్లలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల నందు జరిగిన మండల స్థాయి వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మండలంలో 1621 డ్వాక్రా గ్రూపులకు 16208 మంది డ్వాక్రా మహిళలకు 15 కోట్ల 38 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మహిళల మధ్యలోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఫోటోకి డ్వాక్రా మహిళలతో కలిసి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... మహిళ సాధికారిత ఒక జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే సాధ్యమన్నారు. గత ప్రభుత్వం మహిళలను నమ్మించే మాటలు చెప్పి మోసం చేసిందని, మీ బంగారాన్ని, మీ డ్వాక్రా రుణాలను రద్దు చేసి ఇస్తామని చెప్పి రుణాలు మాఫీ చెయ్యక పోగా తిరిగి వారికే నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు దఫాలుగా రుణ మాఫీ చేశారన్నారు. అలాగే ప్రతీ మహిళను వారి కాళ్లపై వారిని నిలబెట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అమ్మఒడి దగ్గర నుంచి మొదలు పెడితే ప్రజలకు అనేక పథకాలు తీసుకువచ్చామన్నారు. జగనన్న పరిపాలనా కాలంలో రెండేళ్లు కరోనాతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ఎక్కడా సంక్షేమం ఆగకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. దేశంలో ఎక్కడా, ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేయటం లేదని తెలిపారు. బ్యాంకులకు నగదు కట్టలేక ఇబ్బందులు పడుతున్న మహిళలకు ఆసరా పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆడపడుచులకు పుట్టింటి కానుకగా 31 లక్షల మందికి ఇల్లు పట్టాలు మహిళల పేరుమీదనే ఇచ్చామన్నారు.

# నిరుద్యోగులారా జగన్ మోసంపై ఆందోళన వద్దు.. అధైర్యపడొద్దు

- టిడిపి-జనసేన ప్రభుత్వం రాగానే డిఎస్సీ వేసి టీచర్ పోస్టుల ఖాళీలన్నీ భర్తీ చేస్తాం
- నిరుద్యోగులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బహిరంగ లేఖ

**గుంటూరు,కలంకౌంటర్ :** జగన్ మోసంతో నిండా మునిగిన నిరుద్యోగులారా ఆందోళన వద్దు, అధైర్యపడొద్దు. త్వరలో టిడిపి-జనసేన ప్రభుత్వం వస్తుంది. ఖాళీ టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేస్తుంది. 2019 ఎన్నికలకి ముందు అధికారంలోకి రాగానే 23వేల ఖాళీ టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ తీస్తానని జగన్ హామీ ఇచ్చాడు. నమ్మి ఓట్లేసి గెలిపించిన నిరుద్యోగులకు ఇచ్చిన హామీని ఐదేళ్లపాటు మరిచిపోయాడు జగన్. దిగిపోయే ముందు 6వేల పోస్టుల భర్తీకి డీఎస్సీ వేస్తున్నామంటూ జగన్ మరోసారి చేస్తున్న మోసాన్ని గుర్తించండి. 2013లో రద్దయిన అప్రెంటిషిప్ విధానాన్ని మళ్లీ తేవడం జగన్ నాటకంలో భాగమే. 2019 ఎన్నికల ముందు డిఎస్సీ హామీ ఇచ్చాడు, 2024 ఎన్నికలొస్తున్నప్పుడు ఆ హామీని అమలు చేస్తానంటున్న జగన్ మాయమాటలు నమ్మొద్దు నిరుద్యోగులారా అని నిరుద్యోగులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల ముందు 23 వేల ఖాళీలు ఉన్నాయన్న జగన్, ఎన్నికల తరువాత 18 వేల ఖాళీలే అని మాట మార్చాడు. మంత్రి బొత్స ఖాళీగా ఉన్న 8,366 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. చివరికి 6 వేల పోస్టులకు డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఎలక్షన్ డ్రామా మొదలుపెట్టారు. ఏపీలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్రం వెల్లడించింది. ఐదేళ్లకి ముందు 23 వేలు పోస్టులుంటే, జగన్ పాలనలో ఒక్క పోస్టూ భర్తీచేయలేదు, ఈ కాలంలో రిటైరయిన పోస్టులు కలిపితే రెండింతలు కావాలి. అయితే జగన్ మాయతో వేల టీచర్ పోస్టులు గల్లంతయ్యాయి. దీనిపై నిరుద్యోగ యువతకు జగన్ సర్కారు సమాధానం చెప్పాలి. బీఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే, ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే కనీసం పరీక్ష నిర్వహణ కూడా సాధ్యం కాదు. ఇటువంటి పరిస్థితుల్లో డిఎస్సీ నోటిఫికేషన్ అంటే మరోసారి నిరుద్యోగుల్ని వంచించే కుట్రే. ఎన్టీఆర్, చంద్రబాబు నేతృత్వంలోని



ప్రభుత్వాలు ఇప్పటివరకూ 1,70,000 టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత దక్కించుకున్నాయి. ఇదే అనుభవంతో టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. కొత్త పోస్టులు భర్తీ చేయకపోగా, ఉన్న పోస్టులు ఎత్తేసేందుకు జగన్ ప్రభుత్వం తెచ్చిన 117 జీవో వల్ల 65 వేల పోస్టులు రద్దయిపోయాయి. వేల టీచరు పోస్టుల్ని మాయం చేసిన జగన్ నాటకం జీవో 117 ఎత్తేస్తాం. 2013లో రద్దయిన అప్రెంటిషిప్ విధానాన్ని అమలు చేస్తూ జగన్ చేస్తోన్న అన్యాయాన్ని సరిదిద్దుతాం. అప్రెంటిషిప్ విధానం రద్దు చేసి పూర్తిస్థాయి పేస్కేల్ అమలు చేస్తాం. 2014, 2019లో రెండు మెగా డిఎస్సీల ద్వారా 16,790 నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగాలు కల్పించిన చంద్రబాబు మళ్లీ వస్తున్నారు. జగన్ మోసంతో నిరాశ చెందకుండా డిస్సీకి ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కోరారు.

# కనక దుర్గమ్మను దర్శించుకున్న విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి





**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంకు విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి వారు శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారు శ్రీ అమ్మవారి ఆలయంనకు విచ్చేయగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామీజీ వారితో పాటుగా రాష్ట్ర దేవాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ విచ్చేశారు. అనంతరం స్వామిజి వారు శ్రీ అమ్మవారిని దర్శనము చేసుకొని, పూజలు నిర్వహించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరము ఆలయ వేద పండితులు, అర్చకుల వారు స్వామీజీ వారికి వేదస్వస్తి పలికారు. అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు , అధికారులు స్వామీజీ కి శ్రీ అమ్మవారి ప్రసాదములు, పండ్లు సమర్పించగా, స్వామీజీ వారు అందరికీ అనుగ్రహభాషణము చేశారు.

# మోడీని నిలదీసే దమ్ము లేదా

- మనకు పోలవరం అవసరంలేదా? రాజధాని అవసరంలేదా?
- మూకుమ్మడి రాజీనామాలు చేసుంటే మనకు ప్రత్యేక హోదా వచ్చేది కాదా?
- రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద ధర్నా
- ప్రత్యేక హోదాపై చంద్రబాబు, జగన్ ప్రసంగాలను మీడియాకు వినిపించిన షర్మిల




**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదాపై రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకహోదాపై నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు, విపక్షనేతగా ఉన్న జగన్ ఏమని అన్నారో, వారి ప్రసంగాల తాలూకు క్లిప్పింగ్స్ ను అందరికీ వినిపించారు. హోదా ఐదేళ్లు కాదు, పదేళ్లు ఇవ్వాలని చంద్రబాబు పేర్కొనగా, 25కి 25 ఎంపీలను గెలిపిస్తే హోదా ఎలా ఇవ్వరో చూస్తామని జగన్ ఆవేశంగా ప్రసంగించడం ఆ క్లిప్పింగ్స్ లో ఉంది. అనంతరం షర్మిల తన ప్రసంగం కొనసాగించారు. "రాష్ట్ర విభజన తర్వాత మొదట ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు అయినా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జగనన్న అయినా ప్రత్యేకహోదాపై మీరిచ్చిన మాట తప్పితే ఏపీ ప్రజలకు ద్రోహం చేసినట్టా, కాదా? దీనికి మీరిద్దరూ సమాధానం చెప్పాలి. బీజేపీ ఆంధ్ర రాష్ట్రాన్ని మరీ హీనంగా చూస్తోంది. ఏపీ ప్రజలను కనీసం మనుషుల్లా కాకుండా, పురుగుల్లా చూస్తున్నప్పటికీ రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు బీజేపీకి గులాంగిరీ చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని మోదీకి బానిసగా మార్చేశారు. బీజేపీ మనకు ఏమైనా మేలు చేసి ఉంటే, మీరు ఆ పార్టీకి గులాంగిరీ చేసినా ప్రజలు ఏమీ అనుకునేవారు కాదు. మనకు పోలవరం అవసరంలేదా? రాజధాని అవసరంలేదా? పోలవరం ఇవ్వకపోయినా, రాజధాని ఇవ్వకపోయినా మీరెందుకు బానిసలుగా ఉంటున్నారు? ప్రత్యేక హోదా అనేది సంజీవని వంటిదని ఈ నాయకులే చెప్పారు. ప్రత్యేకహోదా కోసం పెద్ద పెద్ద ఉద్యమాలు చేశారు, పెద్ద పెద్ద దీక్షలు చేశారు, ఒక్కొక్కరు పెద్ద పెద్ద మీటింగులు పెట్టారు. ప్రత్యేక హోదా వల్ల ఎంత అభివృద్ధి జరుగుతుందో ఈ నాయకులకు తెలియక కాదు. వీళ్లకు బాగా తెలుసు. ప్రత్యేక హోదా వల్ల ఉత్తరాఖండ్ లో 2 వేల పరిశ్రమలు వచ్చాయి. హిమాచల్ ప్రదేశ్ లో 10 వేల పరిశ్రమలు వచ్చాయి. పరిశ్రమలు రావడం వల్ల మౌలిక వసతుల కల్పన పెరుగుతుంది, మన బిడ్డలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. కానీ ఇవాళ ఎంపీలందరూ ప్రత్యేక హోదా ఊసే లేకుండా ప్రతి అంశంలోనూ బీజేపీకే ఎందుకు మద్దతు ఇస్తున్నారో, మీ మధ్య ఉన్న ఒప్పందం ఏమిటో, ఎందుకు బీజేపీకి ఇంతగా అమ్ముడుపోయారో, బీజేపీకి ఎందుకింత బానిసలుగా తయారయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలి. చంద్రబాబుకు ఐదేళ్లు అధికారం ఇచ్చారు, జగనన్నకు ఐదేళ్లు అధికారం ఇచ్చారు. ఇక మీరు అధికారంలో ఉన్నప్పుడు కూడా నిలదీయకపోతే ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని, కడప స్టీల్ ప్లాంట్, పోర్టు తెచ్చుకోకపోతే ఇంకెప్పుడు అడుగుతారు? దీనికి సమాధానం చెప్పాలి. 25 మంది ఎంపీలు ఉన్నారు. ఒక్కసారైనా మూకుమ్మడి రాజీనామాలు చేసుంటే మనకు ప్రత్యేక హోదా వచ్చేది కాదా? ఒక్కసారైనా నిజమైన ఉద్యమం చేశారా? ప్రజల కోసం కొట్లాడాలి అని ఒక్కసారైనా అనుకున్నారా? మోదీని కనీసం ప్రశ్నించారా? ఆ దమ్ము కూడా మీకు లేకపోయింది. ఇవాళ మోదీ రాష్ట్రాన్ని అతి హీనంగా చూస్తున్నారు. రూ.46 లక్షల కోట్ల బడ్జెట్ ప్రకటించారు. అందులో మోడీ ఏపీకి ఏం కేటాయించారు? రాష్ట్రానికి మోడీ ఏం చేయనప్పుడు ఆయనకు మీరు ఎందుకు గులాంగిరీ చేస్తున్నారో చెప్పాలి" అంటూ షర్మిల నిప్పులు చెరిగారు.

# గ్రామ రెవెన్యూ సహాయకుల డి.ఏ పునరుద్ధరణ పై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఏపీజేఏసీ అమరావతి

**వెలగపూడి,కలంకౌంటర్ :** గ్రామ రెవెన్యూ సహాయకులకు గతంలో ఇస్తున్న డి ఏ ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మరియు ఏపీజేఏసీ అమరావతి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు మాసాలకు ఒకసారి డి ఎ మంజూరు కాగానే, గ్రామ రెవిన్యూ సహాయకులకు కూడా ప్రభుత్వం ప్రతి నెల కేవలం మూడు వందల రూపాయలు మాత్రమే డి ఏ రూపంలో 2017వరకు మంజూరు చేస్తూ ఉండేవారు. దశాబ్దాల క్రితం అయిదు రూపాయలతో మొదలు అయిన డి ఎ, 2017నాటికి మూడు వందలకు చేరింది. ఈ దశలో గత ప్రభుత్వ హయాంలో 2018లో గ్రామ రెవెన్యూ సహాయకులు జీతం 6500 నుండి 10,500 లకు పెంచుతూ, అప్పటివరకు డి ఎ రూపంలో ఇస్తున్న 300 ల విషయం సదరు జీతాలు పెంచిన జీఓలో పొందుపరచలేదు. కానీ జీతాలు పెంచక ముందు నుండే అంటే 2017లోనే అడహక్ డి ఎ 300 పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులు ఉన్నందున, 2018 లో జీతాలు కొరకు ఇచ్చిన జీవో లో ఆ విషయాన్ని పొందు పరచక పోయినప్పటికీ రాష్ట్రంలో వీఆర్ఏ లకు 2018-2020వ సంవత్సరం వరకు డీఏ 300 లతో కలిపి వారందరికీ జీతాలు చెల్లించే వారు. ట్రెజరీ శాఖ ద్వారా పై విషయాన్ని తెలుసుకున్న ప్రస్తుత ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా అనగా 2018 నుండి 2020 వరకు చెల్లించిన డి ఎ ను షుమారు 14 కోట్లు రికవరీ చేయడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం పక్షాన అనేక సమావేశాల్లో సిఎస్ కి, మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి, ముఖ్యమంత్రి కార్యాలయం లోని ఉన్నతాధికారుల దృష్టికి అందరికీ అనేక సమయాల్లో వారి దృష్టికి తీసుకుని వెళ్లి రికవరీ ఆపేయాలని, తిరిగి నాటి నుంచి డి ఏ ను పునరుద్ధరణ చేయాలని ఏపీ జేఏసీ అమరావతి పక్షాన గత 2023 లో చేసిన 92 రోజుల ఉద్యమం లో కూడా ఈ అంశాన్ని ప్రధానంగా చర్చించింది. గ్రామ రెవిన్యూ సహాయకులు రెవిన్యూ శాఖలో అట్టడుగు స్థాయిలో శక్తి వంచన లేకుండా పనిచేస్తూ చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణముగా వారు నిలదొక్కుకోవడానికి వారికి ఇస్తున్న డి ఏ ను నిలుపుదల చేయడం దారుణమని అలాగే గతములో మంజూరు చేసిన డి ఎ ని కూడా రికవరీ చేయడము అనేది ఇంకా దారుణమని దీని వల్ల ఈ చిరుద్యోగులు వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఇటీవల గౌరవ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో 13/07/2023 తేదీన నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశములో సిఎస్ మరియు ఇతర ఉన్నతాధకారుల దృష్టికి గట్టిగా తీసుకెళ్ళడము వలన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వి ఆర్ ఎ ల డి ఏ కు సంబంధించి సానుకూల ఉత్తర్వులు వస్తాయని ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో గ్రామ రెవిన్యూ సహాయకులు (వి.ఆర్.ఏ) గా పనిచేస్తున్న 19359 మంది వి. ఆర్. ఏ లు ప్రభుత్వం పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ, 2018 వ సంవత్సరంలో గత ప్రభుత్వంలో ఆపివేసిన వి.ఆర్.ఏ ల కరువు భత్యంను పునరుద్దరిస్తూ తేదీ 2.2.2024 నుండి అమలు లోకి తీసుకువస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు జారీ చేసినందుకు ఏ.పి.జె.ఏ.సి.అమరావతి మరియు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు , విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యస్. జవహర్ రెడ్డి, సిసియల్ఏ %ఛ% స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్, అజయ్ జైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, ఏపీ జేఏసీ అమరావతి సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణ మూర్తి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# కృష్ణాజిల్లాలో ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ
- 77 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ ఎగ్జామ్స్
- 59 కేంద్రాల్లో థియరీ పరీక్షలు
- జిల్లాలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ లతో ఆకస్మిక తనిఖీలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని జె సి చాంబర్ లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఫిబ్రవరి 2 వ తేదీ అలాగే శనివారం ఫిబ్రవరి 3 వ తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషనల్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు జరుగుతాయన్నారు. అలాగే ఫిబ్రవరి 22 వ తేదీన ( గురువారం ) సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు జరగనుందన్నారు. ఈనెల 5 నుంచి 20 వరకూ ఎంపిక చేసిన కేంద్రాల్లో ఒకేషనల్ కోర్సులకు సంబంధించి పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే ప్రాక్టికల్స్, ఈ నెల 11 నుంచి 20 వరకూ జనరల్ విద్యార్థులకు 77 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్స్ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

**59 కేంద్రాల్లో థియరీ పరీక్షలు..** జిల్లావ్యాప్తంగా 59 కేంద్రాల్లో ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 1 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయన్నారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. నిమ్మకూరు గ్రామంలో ఏ పి ఆర్ జె సి కళాశాల మాత్రమే సెల్ఫ్ సెంటర్ గా కొనసాగుతుందని, నందివాడ మండలం రుద్రపాక గ్రామంలో జూనియర్ కళాశాల గుడివాడ టౌన్ కు 24 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎం విధిగా ఉండేవిధంగా ఏర్పాటుచేసి తక్షణ మందులు,మెడికల్ కిట్ తో అప్రమత్తంగా ఉండి ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఒకొక్క పరీక్షా కేంద్రంకు చీఫ్ సూపరెండెంట్ కేటాయించినట్లు, ప్రతి సెంటర్లో సి సి కెమారాల నిఘా ఉంటుందన్నారు. అలాగే పరీక్షా కేంద్రాలలో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేసి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఇంటర్మెడియటే పరీక్షల నేపథ్యంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్‌టికెట్ మంజూరు చేయాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం ప్రత్యేక రుసుం వసూలు చేయరాదన్నారు. ఎవరైనా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జె సి గీతాంజలి శర్మ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారిణి పెద్ది రోజా, జిల్లా రవాణా అధికారిణి ఆకురాతి వాణిశ్రీ, డి ఈ సి 1 మొవ్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ శాస్త్రి , డి ఈ సి 2 కానుమోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. రవి కిరణ్,డి ఈ సి 3 పామర్రు జూనియర్ కళాశాల బీ వీ రమణ, డి ఈ సి 4 మొవ్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ లెక్టరర్ ఆనంద్,డీవైఈవో సుబ్బారావు, విద్యుత్, పోలీస్, తపాల శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com